# పలాసలో ఏప్రిల్ కు ఆర్వోబి, జూన్ నుండి
# కేంద్రీయ విద్యాలయ తరగతులు

### కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు



**నవతరం - పలాస**

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు మంగళవారం నాడు శ్రీకాకుళం జిల్లాలోని పలాస పట్టణంలో సుడిగాలి పర్యటన చేపట్టారు. ఉదయం 9 గంటలకు పలాస చేరుకున్న కేంద్ర మంత్రి తొలుత రైల్వే స్టేషన్ సమీపంలోని పై వంతెన పనులను సమీక్షించారు. ప్రాజెక్ట్ రిపోర్టును పరిశీలించి.. ప్రస్తుత స్థితిని ఆరా తీశారు. పనుల్లో ఆలస్యం జరుగుతోందని, రేయింబవళ్ళు పనులు జరగాలని స్పష్టం చేశారు. ఏప్రిల్ నాటికి వంతెనను అందుబాటులోకి తీసుకురావాలని అదేశించారు. రైల్వే వంతెన తో పాటు అనుకుని సర్వీసు రోడ్డు పనులు కూడా వేగంగా జరపాలని తెలిపారు.
అనంతరం అక్కడి నుండి పలాస లోని నెమలికొండ ప్రాంతాలలో త్వరలో నిర్మాణం జరగనున్న కేంద్రీయ విద్యాలయ ప్రాంతాన్ని పరిశీలించారు. భవనాలు నిర్మాణం జరిగే తీరును ప్రాజెక్టు రిపోర్టు ద్వారా కేంద్ర మంత్రికి కలెక్టర్, ఆర్డీవో వివరించారు. పాఠశాలకు అనుసంధానం అయ్యే రోడ్లు, ఇతర మౌలిక వసతులను ఆరా తీశారు.
అక్కడి నుండి పలాస పట్టణంలోని రైల్వే కాలనీలో బారక్ భవనాలను పరిశీలించారు. రాబోయే విద్యా సంవత్సరం తరగతులను ఈ భవనాలు నుండి జరపాలని నిర్ణయించిన -మిగతా 2లో

# రీ-సర్వే లక్ష్యాలను
# సకాలంలో పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

**నవతరం -శ్రీకాకుళం**

జిల్లాలో భూముల రీ-సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని, వెబ్‌ల్యాండ్ రికార్డుల్లో ఉన్న వ్యత్యాసాలను తక్షణమే సరిదిద్దాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తో కలసి మంగళవారం కలెక్టరేట్ నుంచి తహసీల్దార్లు, ఎంపీడీఓలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన రీ-సర్వే పురోగతిపై గణాంకాలతో సహా సుదీర్ఘంగా సమీక్షించారు. ప్రస్తుతం జిల్లాలో 4వ దశ రీ-సర్వే 167 గ్రామాల్లో లక్ష్యంగా పెట్టుకోగా, ఫిబ్రవరి 16 నాటికి 24 గ్రామాల్లో సర్వే పూర్తయిందని, మిగిలిన 143 గ్రామాల్లో సర్వే పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. వెబ్‌ల్యాండ్ రికార్డుల్లో 'ఇతరులు' అనే పేరుతో ఉన్న భూముల వివరాలను పరిశీలిస్తే, జిల్లా వ్యాప్తంగా 29,953 సర్వే నంబర్లలో వ్యత్యాసాలు



ఉన్నట్లు గుర్తించారు. దీనికి సంబంధించిన మొత్తం భూమి విస్తీర్ణం 7,709.22 ఎకరాలుగా ఉందన్నారు. వీటిపై కూడా రెవెన్యూ యంత్రాంగం తగిన దృష్టి -మిగతా 3లో

# విశాఖ వేదికగా ఐఎఫ్ఆర్







2లో

## సూపర్ సిక్స్ అమలు
## చేయలేని బడ్జెట్

- గారడీ లెక్కలు.. అప్పుల ప్రణాళికలే
- వైఎస్ఆర్సిపి మందస మండలం సీనియర్ నేత మద్దిలి బాలకృష్ణ యాదవ్

2లో



## అప్పుల ఊబి నుండి..
## అభివృద్ధివైపు సంక్షేమం..

- అభివృద్ధి ఎజెండాగా రాష్ట్ర బడ్జెట్
- జనసేన పార్టీ పలాస పట్టణ నేత నందిగాం ధర్మారావు

2లో



## పోక్సో కేసులో నిందితుడికి
## ఏడాది జైలు శిక్ష



**నవతరం -మందస**

మందస మండలం, జిల్లుండా గ్రామానికి చెందిన ఒక చిన్నారిపై వేధింపులకు పాల్పడిన నిందితుడికి శ్రీకాకుళం కోర్టు ఏడాది జైలు శిక్ష విధించింది. మందస ఎస్.ఐ కె.కృష్ణ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం 2019 డిసెంబర్ 30వ తేదీ తెల్లవారుజామున జిల్లుండా గ్రామంలోని బాధితురాలి పై అదే గ్రామానికి చెందిన తిరుపతి అనే వ్యక్తి వెకిలి చేష్టలతో,అసభ్యకరంగా ప్రవర్తించగా బాధితురాలి తల్లి జరిగి ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు సాక్ష్యాధారాలు సేకరించి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. విచారణ అనంతరం కోర్టు నిందితుడిని దోషిగా తేల్చి ఒక సంవత్సరం జైలు శిక్షతో పాటు రూ.500 జరిమానా మరియు సెక్షన్ 506 ఐపిసి నేరం ప్రకారం 6 నెలల శిక్ష విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా నెల జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తెలిపారు. విధించిన శిక్షలు ఒకేసారి అమల్లో ఉంటాయని కోర్టు పేర్కొంది.


# నవతరం

RNI NO. APTEL/2014/58326

తెలుగు దినపత్రిక

సంపుటి : -13 సంచిక : 103 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి

18-02-2026 బుధవారం వెల : 1 /- పేజీలు : 4


# తండ్రికి తగ్గ తనయ "డేవిడ్"

- ట్రెజరీ హెల్పింగ్ టీమ్ ఎప్పుడూ అద్భుతమే
- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు



**నవతరం -గార**

తండ్రికి తగ్గ తనయ మాదారపు.డేవిడ్ అని, ట్రెజరీ హెల్పింగ్ టీమ్ ఎప్పుడూ అద్భుతమైన, అమూల్యమైన సేవలను కొనసాగిస్తున్నారని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు.
మాదారపు.డేవిడ్ జన్మదినం సందర్భంగా ఏదో ఒక సేవ చేయాలనే ఆలోచనతో ఒక మంచి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రెజరీ హెల్పింగ్ టీమ్ ఆధ్వర్యంలో నియోజకవర్గ గార మండలం, రెడ్డి పేటకు చెందిన చిన్నారి వర్షిత, గత కొంతకాలంగా నరాల బలహీనతతో బాధ పడుతున్నారని, అలాగే నందిని అనే చిన్నారి తలకు సంక్రమణతో బాధపడుతున్నారని, వీరికి కేంద్ర మంత్రి వర్యులు రామ్మోహన్ నాయుడు చేతుల మీదుగా మేము ఆర్థిక సహాయం అందజేయడం జరిగిందని ట్రెజరీ హెల్పింగ్ సభ్యుల బృందం తెలిపారు. వీరి సమస్యను రామ్మోహన్ నాయుడు దృష్టికి తీసుకువెళ్లడంతో, స్పందించిన మంత్రి, ప్రభుత్వం నుంచి సాయం అందిస్తామని భరోసానిచ్చారన్నారు. అనంతరం డేవిడ్ మాట్లాడుతూ వీరిది పేద కుటుంబమని, తల్లి మాత్రమే తోడు ఉండి, తను కష్టపడుతూ, పిల్లలను చూసుకుంటుందని, సమస్య చూసి మీకు సాయం చేయాలనీ అనిపిస్తే ఆడపిల్లలకు చేయూత ఇవ్వాల్సిందిగా మనవి చేస్తున్నామన్నారు.

# విద్యా ధనమ్
# సర్వ ధనత్ ప్రధానం

- అంతం లేనిది విద్య ఒక్కటే
- బిజెపి నాయకులు పోకతోట.సింహాచలం దొర

2లో



ఎడిటోరియల్

# మరో ఆయుధ పోటీకి అమెరికా నాంది?

ఫిబ్రవరి ఐదవ తేదీతో అమెరికా-రష్యాల మధ్య అణ్వాయుధ నియంత్రణ ఒప్పందం ముగిసిన తరువాత మరోసారి ఆయుధపోటీకి తెరలేచిందా? గతంలో సోవియట్ యూనియన్, తర్వాత రష్యాను బూచిగా చూపిన అమెరికా ఇప్పుడు చైనా నుంచి ముప్పు ఉందని ప్రపంచాన్ని నమ్మించేందుకు పూనుకుంది. ఐదేళ్ల క్రితం చైనా అణ్వాయుధ పరీక్ష జరిపిందని అమెరికా విదేశాంగశాఖ సహాయమంత్రి ఇటీవల జెనీవాలో నిరాయుధీకరణ సమావేశంలో ఆరోపించాడు. మేకపిల్లను తినదలచుకున్న తోడేలు కథను గుర్తుకు తెచ్చాడు. వాగు ఎగువన ఉన్న తోడేలు నీళ్లను మురికి చేస్తున్నావంటూ దిగువన ఉన్న మేకపిల్ల మీద ఆరోపించింది. నేను దిగువన ఉంటే పైననీళ్లు ఎలా మురికి అవుతాయని ప్రశ్నిస్తే, నీవు గాకపోతే మీ అమ్మ చేసిందిలే అని దాడిచేసింది తోడేలు. ఐదేండ్ల క్రితం చైనా అణుపరీక్ష జరిపిందని అమెరికా చెప్పటం అలాంటి అడ్డగోలు తనం తప్ప మరొకటి కాదు.
అయితే చైనా అణుపరీక్ష జరిపినట్లు ఎలాంటి ఆధారాలు, ఆనవాళ్లు లేవని సమగ్ర అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పంద(సిటిబిటి) సంస్థ కార్యదర్శి రాబర్ట్ ఫ్లాయడ్ వెంటనే ఒక ప్రకటనలో స్పష్టం చేశాడు. అమెరికా మంత్రి చెప్పిన సమయంలో అణ్వస్త్ర పరీక్ష జరిపిన లక్షణాలేమీ కనిపించలేదన్నాడు.నిత్యం అసత్యాలతో బతుకున్న అమెరికా తన ఆరోపణను వెనక్కు తీసుకుంటుందని ఎవరైనా అనుకుంటే అత్యాశే అవుతుంది. తాము సిటిబిటికి పూర్తిగా కట్టుబడి ఉన్నామని చైనా బుధవారం నాడు స్పష్టం చేసింది. ఆ ఒప్పందంపై సంతకాలు చేసిన తొలి దేశాలలో ఒకటైన చైనా 1996 నుంచి అణుపరీక్షల వాయిదా ప్రకటించి అమలు చేస్తున్నది.
అణ్వాయుధాల గుట్టలపై కూర్చున్న అమెరికా ఇతరుల మీద నిస్సిగ్గుగా ఆరోపణలను గుప్పిస్తున్నది. మరొకసారి అణుబాంబులను ప్రయోగించ నంటూ ప్రతిజ్ఞ చేసేందుకు తిరస్కరిస్తున్నది. ఆయుధ నియంత్రణ ఒప్పందానికి తూట్లు పొడిచింది, ఇప్పుడు గడువు మీరిన తర్వాత మరోసారి పరీక్షలు చేసి కొత్తగా మరికొన్ని వేల ఆయుధాల తయారీ గురించి మాట్లాడుతూ ప్రపంచాన్ని భయపెడుతున్నది.
ప్రస్తుతం ప్రపంచంలో అణ్వాయుధాలు కలిగిన దేశాలు తొమ్మిది ఉన్నాయి. వాటిలో అమెరికా, రష్యా, చైనా, ఫ్రాన్సు, బ్రిటన్ మాత్రమే అధికారికంగా ఎన్‌పిటి మీద సంతకం చేసినవిగా గుర్తింపు పొందాయి. ఇవి ఆ ఒప్పందం జరిగిన 1967కు ముందే ఆయుధాలను తయారు చేశాయి. ఒప్పందం పై సంతకాలు చేయని భారత్, పాకిస్థాన్, ఒప్పందం నుంచి వైదొలిగిన ఉత్తర కొరియా కూడా ఇప్పుడు వాటిని కలిగి ఉన్నట్లు స్వయంగా ప్రకటించాయి. ఇజ్రాయిల్ వద్ద కూడా ఉన్నప్పటికీ అది ఎలాంటి ప్రకటన చేయలేదు. ఎన్‌పిటిపై ఇరాన్ కూడా సంతకం చేసినప్పటికీ అమెరికా అనుసరిస్తున్న శత్రుపూరిత వైఖరి కారణంగా తాము బాంబుల తయారీకి అవసరమైన అణుశుద్ధి చేస్తామని ప్రకటించింది. దాన్నుంచి నివారించేందుకు చేసుకున్న ఒప్పందం నుంచి అమెరికా వైదొలగటంతో సమస్య తిరిగి మొదటికి వచ్చింది. ఇప్పుడు ఇరాన్‌ను చూపి తాము కూడా అణుకార్యక్రమాన్ని చేపడతామంటూ టర్కీ ప్రకటించింది. మధ్య ప్రాచ్యంలో బలాబలాలు సమతూకంతో ఉండాలంటే తప్పదని చెప్పుకుంది. దీనివెనుక అమెరికా హస్తం లేదని చెప్పలేము.

నిజానికి ఇరాన్‌ను రెచ్చగొట్టింది, బాధ్యతా రహితంగా వ్యవహరించింది అమెరికా. ఒప్పందం నుంచి వైదొలగాల్సిన అగత్యం ఎందుకు వచ్చిందో డోనాల్డ్ ట్రంప్ చెప్పలేదు. ఇజ్రాయిల్‌ను వ్యతిరేకిస్తున్నది గనుక ఏదో ఒకసాకుతో దానిపై దాడిచేసి లొంగదీసుకోవాలన్న దుష్ట చింతన తప్ప మరొక పరమార్ధం లేదు. టెహరాన్ అణుబాంబు తయారీని అనుమతించే ప్రసక్తేలేదు, దాడులు చేస్తామంటూ ఇటీవల భారీఎత్తున నౌకాదళాన్ని మోహరించిన సంగతి తెలిసిందే. ప్రపంచ అణుశక్తి దేశాలు జవాబుదారీతనంతో వ్యవహరించాలని టర్కీ ప్రకటనపై రష్యా వ్యాఖ్యానించింది. ఎందుకంటే టర్కీ నాటో కూటమి సభ్యురాలు. నాటో ఒప్పందంలో భాగంగా దాని ఇన్సిర్‌లిక్ వైమానిక కేంద్రంలో అమెరికా అణ్వాయుధాలు మోహరించి ఉన్నాయి. నిజానికి అవి మధ్యప్రాచ్యం, పశ్చిమాసియాను బెదిరించేందుకు తప్ప ఆ ప్రాంత దేశాల నుంచి నాటో దేశాలకు ఎలాంటి ముప్పులేదు. అణు నిరాయుధీకరణకు తాము ఇప్పటికీ కట్టుబడి ఉన్నామని మరో ఒప్పందం కుదుర్చుకొనేందుకు చర్చలు జరపాలని మాస్కో కోరింది. అయితే మరో ఒప్పందం అంటూ కుదిరితే చైనా కూడా ఉండాలంటూ అమెరికా పేర్కొన్నది. రష్యా, అమెరికాలతో పోల్చితే తమ దగ్గర ఉన్నవి తక్కువ అని, అందువలన తాము చేరే ప్రసక్తి లేదని బీజింగ్ స్పష్టం చేసింది.ఏదో ఒకసాకుతో మరింత ప్రమాదకరమైన ఆయుధపోటీకి తెరలేపుతున్న అమెరికాను ప్రపంచశాంతి శక్తులు అడ్డుకోకపోతే ముప్పు మరింత పెరిగినట్లే!

# సూపర్ సిక్స్ అమలు చేయలేని బడ్జెట్

**నవతరం -మందస**

కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన మూడో విడత బడ్జెట్లో సంక్షేమ పథకాలు లేవని, సంక్షోభం మాత్రమే కనిపిస్తుందని, ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలైన సూపర్ సిక్స్ పథకాలతో పాటు మరో 136 హామీలకు అతిగతి లేదని వైయస్సార్సీపి మందస మండల సీనియర్ నేత మద్దిలి బాలకృష్ణ యాదవ్ అన్నారు. మంగళవారం ఆయన మందస మండలం హరిపురంలో మీడియాతో మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలు, చెబుతున్న అబద్ధాలు ఈ వార్షిక బడ్జెట్లో కళ్లకు కట్టినట్లు కనిపిస్తున్నాయని బాలకృష్ణ యాదవ్ విమర్శించారు. ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి ఊసే లేదని, 50 ఏళ్లకే ఎస్సీ, ఎస్టి, బీసీ, మైనార్టీలకు పింఛన్లు ఇస్తామని దానికి ఒక్క పైసా కూడా కేటాయించలేదన్నారు.
వైయస్ఆర్సీపీ ప్రభుత్వంలో సంక్షేమానికి, అభివృద్ధికి పెద్ద పీట వేసి డీబీటీ ద్వారా ప్రజల ఖాతాలకు నగదు జమ చేస్తుంటే.. వైయస్ జగన్ ఆర్థిక విధ్వంసం చేస్తున్నారని నాడు కూటమి పార్టీలు విమర్శలు చేశారని, ఇప్పుడు సంక్షేమ పథకాలు లేవు.. అభివృద్ధి కార్యక్రమాలు లేవు.. అయితే మాత్రం రాష్ట్రాన్ని అప్పులు కుప్పగా కూటమి సర్కార్ మార్చి వేసిందని బాలకృష్ణ యాదవ్ ఆరోపించారు. వైయస్ఆర్సీపీ ప్రభుత్వంలో ఓడరేవులు, నాడు- నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలు ఆధునికరణ, ఆసుపత్రులు అభివృద్ధి, రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాలు, వెల్నెస్ సెంటర్లు నెలకొల్పడం జరిగిందని, ఇన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినప్పటికీ, రూ. 3.18 లక్షల కోట్లే అప్పులు అయ్యాయి అన్నారు. కూటమి ప్రభుత్వం ఏ పథకాలు అమలు చేయకపోయినా రెండు సంవత్సరాలు కాకముందే రూ.3.27 లక్షల కోట్లు అప్పులు చేశారన్నారు. సంపద సృష్టిస్తానని చెప్పిన పెద్దమనిషి ఇప్పుడు అప్పులు సృష్టిస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. రాష్ట్ర బడ్జెట్లో అంకెల గారడీ, మాటల బురిడీ తప్ప ప్రజలకు ఒరిగేది ఏమీ లేదన్నారు. చంద్రబాబు ప్రభుత్వంలో సంక్షేమ పథకాలకు పాతర వేసినట్లేనని, అన్నదాత సుఖీభవ పథకానికి రైతుకు రూ. 20,000 చొప్పున ఇవ్వాలంటే బడ్జెట్ కేటాయింపులో సంవత్సరానికి రూ. 10,700 కోట్లు కావాలని, అయితే కేటాయించిన నిధులు కేవలం రూ. 6000 కోట్లేనని, సున్నా వడ్డీ కింద రుణాలు, పంటలకు ఉచిత బీమా కేటాయింపులు లేనే లేవన్నారు. అన్నదాతలను పూర్తిస్థాయిలో విస్మరించారని, చివరకు ధరల స్థిరి కరణ కింద రూ. 500 కోట్లు మాత్రమే కేటాయించారని ఆయన విమర్శించారు. వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వంలో ధరల స్థిరీకరణ కింద రూ. 7, 800 కోట్లు ఖర్చు చేయడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ప్రజా రంజక పాలన అందించడంలో వైఫల్యం చెంది ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరిస్తుందని , ఇలా అంకెల గారడీతో ప్రజలకు మోసం చేయడం తప్ప,ప్రజలకు మేలు చేసే ప్రయత్నం కూటమి ప్రభుత్వం చేయలేదన్నారు. ప్రధానంగా వెనుకబడిన జిల్లాగా ఉన్న శ్రీకాకుళం జిల్లా ఉద్దాన ప్రాంతాన్ని పూర్తిగా బడ్జెట్లో కూటమి ప్రభుత్వం విస్మరించిందన్నారు. ఉద్దానం ప్రాంతంలో వలసలు నివారించాలంటే, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు తోపాటు పర్యావరణానికి హానిలేని ఇండస్ట్రియల్ పార్క్ నెలకొల్పాలని, ముఖ్యంగా ఉద్దానం ప్రాంత ప్రజల ఆకాంక్ష పలాస జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేస్తే, మిగతా జిల్లాల తోపాటు సమానంగా సమగ్ర అభివృద్ధి సాధించే అవకాశాలు ఉన్నాయని బాలకృష్ణ యాదవ్ అభిప్రాయపడ్డారు. బడ్జెట్లో సవరణ చేసి ఉద్దానం ప్రాంతానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని, అందుకు స్థానికంగా ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రజా ప్రతినిధులు చట్టసభల్లో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి అనుకున్న డిమాండ్ల సాధనకు కృషి చేయాలని ఆయన కోరారు.

## పలాసలో ఏప్రిల్ కు ఆర్వోబీ, జూన్ నుండి
# కేంద్రీయ విద్యాలయ తరగతులు

మొదటిపేజీ తరువాయి

నేపథ్యంలో రైల్వే అధికారులతో గదుల అప్పగింతపై అనుమతుల సమస్యను పరిష్కరించారు. కేంద్రీయ విద్యాలయ అధికారులతో సమన్వయం చేసుకుని ఈ ఏడాది తరగతులు పక్కగా నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మీడియా రామ్మోహన్ నాయుడు మాట్లాడారు. పలాస పరిసర ప్రాంతాలతో పాటు జిల్లా వాసుల ఎన్నో ఏళ్ల కల అయిన, పలాస ాాదీ ప్రాజెక్టు ఇప్పుడు వేగంగా నిర్మాణం జరుగుతూ ఉండటం ఆనందంగా ఉందని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే దీనికి అత్యున్నత ప్రాధాన్యత ఇచ్చి, ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పనులను తిరిగి ప్రారంభించామని తెలిపారు. భారతీయ రైల్వే మరియు జిల్లా యంత్రాంగం సమన్వయంతో నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని అన్నారు. ఈ ాాదీ పూర్తి అయితే పలాస పట్టణంలో ట్రాఫిక్ రద్దీ తగ్గి ప్రయాణికులకు సౌకర్యవంతమైన రాకపోకలు కలుగుతాయని అన్నారు. అలాగే పలాస లో ఏర్పాటు కానున్న కేంద్రియ విద్యాలయానికి తాజా వివరాలను వెల్లడించారు. రాబోయే విద్యాసంవత్సరం నుండే తరగతుల నిర్వహణ కోసం ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. రైల్వే అధికారులతో మాట్లాడి బారెక్ భవనాలకు సంబంధించిన అనుమతుల సమస్యను పరిష్కరించామని తెలిపారు. ఈ పాఠశాల ద్వారా సాయుధ దళాల సిబ్బంది, కేంద్ర సంస్థల ఉద్యోగుల పిల్లలకు నాణ్యమైన విద్యా అవకాశాలు లభిస్తాయనీ ఆశాభావం వ్యక్తం చేశారు.
ఈ కార్యక్రమంలో కూటమి శ్రేణులు, రెవెన్యూ, రైల్వే అధికారులు స్థానికులు పాల్గొన్నారు.

# అప్పుల ఊబి నుండి.. అభివృద్ధివైపు సంక్షేమం..

**నవతరం -పలాస**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించిన 2026-27 వార్షిక బడ్జెట్ ను శాసనసభలో ప్రవేశపెట్టిన కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమం, అన్నదాతల సంక్షేమం, మహిళా సాధికారిత, విద్యాభివృద్ధి, మౌలిక రంగ సదుపాయాలు విస్తరణ లక్ష్యాలుగా రూపొందించిన ఈ బడ్జెట్ రాష్ట్ర అభివృద్ధికి ఎంతో తోడ్పాటు ఇస్తుందని జనసేన పార్టీ పలాస పట్టణ యువజన నేత నందిగాం ధర్మారావు వ్యాఖ్యానించారు. మంగళవారం ఆయన పలాసలో మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను సమగ్రంగా విశ్లేషించి, సమతుల్య దృక్పథంతో కేటాయింపులు చేయబడిన తీరు కూటమి ప్రభుత్వ పరిపాలన దక్షతకు స్పష్టంగా ప్రతిబింబిస్తుందన్నారు. సంక్షేమం, అభివృద్ధి అనే రెండు చక్రాలపై రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లే విధంగా ఈ బడ్జెట్ రూపకల్పన జరిగినట్లు స్పష్టమవుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర బడ్జెట్ల లతో వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధనకు ఈ బడ్జెట్ ఒక వరమని నందిగాం ధర్మారావు కొనియాడారు. రోడ్లు, ఓడరేవులు, విమానాశ్రయాల కు 13 వేల కోట్ల రూపాయలు కేటాయింపు శుభ పరిణామన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పులు వలన నిన్నటి వరకు అప్పులు ఊబిలో ఉన్న ఆంధ్ర ప్రదేశ్ ను అభివృద్ధి వైపు పరుగు తీసేలా ఈ బడ్జెట్ ఉందన్నారు.
ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ కేటాయింపుల వివరాలను నిశితంగా పరిశీలించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ నిర్దేశించుకున్న లక్ష్యాలను ఈ బడ్జెట్ ద్వారా మరింత వేగంగా చేరువ అవ్వచ్చునని తన విశ్వాసాన్ని నందిగాం ధర్మారావు స్పష్టం చేశారు. ప్రజల అవసరాలు, సంక్షేమం, అభివృద్ధి అంశాలను దృష్టిలో ఉంచుకొని విద్య, వైద్యం, వ్యవసాయం, మౌలిక సదుపాయాలు, యువతకు ఉపాధి వంటి కీలక రంగాలకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వడం అభినందనీయమన్నారు. గ్రామీణ రహదారులు, తాగునీటి పథకాలు, పారిశ్రామిక అభివృద్ధి, ఐటీ రంగ ప్రోత్సాహానికి కేటాయించిన నిధులు రాష్ట్ర భవిష్యత్తుకు బలమైన పునాది ఈ బడ్జెట్ వేస్తుందన్నారు. ముఖ్యంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చం నాయుడు శ్రీకాకుళం జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించడం వల్ల జీడిమామిడి మరింత విస్తరించేందుకు జీడి క్లస్టర్ ఏర్పాటు చేసుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, అంతేకాక మూలపేట పోర్టు సకాలంలో నిర్మాణం పూర్తి కాబట్టే వ్యవసాయ ఆధారిత వస్తువులు ఎగుమతులు, దిగుమతులకు ఎంతో ఉపయోగం ఉంటుందని, అలాగే పారిశ్రామిక రంగం విస్తరించే అవకాశం ఉందన్నారు.

## విద్యా ధనమ్
# సర్వ ధనత్ ప్రధానం

**నవతరం -శ్రీకాకుళం**

విద్యా ధనమ్ సర్వ ధనత్ ప్రధానమని, బిజెపి నాయకులు, రవితేజ డెవలపర్స్ అధినేత పోకతోట.సింహాచలం అన్నారు. స్థానిక మంగువారితోట దరిలో నివాసముంటున్న సరంతి.నాగు, శ్యామల దంపతుల కుమార్తె, సరంతి.జయలక్ష్మి వైద్య విద్యకు పోకతోట మంగళవారం సహకారమందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరంతి.జయలక్ష్మి చాలా బాగా చదువుతుందని, తన ఉన్నత చదువులకు పేదరికం అడ్డుకాకూడదని, జయలక్ష్మి కుటుంబ పరిస్థితిని సామాజిక సేవకులు ఉర్లం.శివతేజ, పీకే ఎంటర్టైన్మెంట్ వ్యవస్థాపకులు సతివాడ.ప్రసాద్, కీర్తిలు నా వరకు తీసుకువచ్చారని, వారి స్థితిని ఈ రోజు చూశానని, ఆమె అభ్యర్థన కోరిక మేరకు వైద్యవిద్యకు ప్రోత్సహాన్నివ్వాలనే ఉద్దేశ్యంతో మొన్న జరిగిన కార్యక్రమంలో ఇచ్చిన మాట ప్రకారం ఆమె సర్టిఫికెట్ లకు అయ్యే రుసుమును అందించామన్నారు.
ఇందులో ముడిదాన.పూర్ణచంద్ర, బొడ్డేపల్లి లక్ష్మణరావు, అట్టాడ.అప్పలనాయుడు, అరికితోట కనకరాజు, లోకనాథం రామలింగస్వామి, దేవ్, మోహన్ రావు మాస్టర్, మోహన్ శ్రీవత్స, శ్రీకాకుళం సోల్జర్ నర్సింగ్ గోపాలరావులు కూడా సహకారమందించారన్నారు.
విద్య భౌతిక సంపద కంటే ఉన్నతమైనదని, అన్ని రకాల సంపదలలో జ్ఞాన దానం ఉత్తమమైనదన్నారు. ఇతరులకు విద్యను అందించడం ఒక ప్రాథమిక కర్తవ్యంగా భావించి, ప్రత్యేక శ్రద్ధవహించిన సామాజిక సేవకులు ఉర్లం.శివతేజ, పీకే ఎంటర్టైన్మెంట్ వ్యవస్థాపకులు సతివాడ.ప్రసాద్, కీర్తిలకు ప్రత్యేక అభినందనాలన్నారు.
ఈ కార్యక్రమంలో విద్యార్థిని కుటుంబ సభ్యులు, అరసవల్లి సిక్కోలు సైనికుడు, పీకే ఎంటర్టైన్మెంట్ సభ్యుల బృందం పాల్గొన్నారు.

# విశాఖ వేదికగా ఐఎఫ్ఆర్

**(డా. ఎం. ఆర్. ఎన్. వర్మ)**

ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్ఆర్) వేడుకకు విశాఖ వేదిక అయింది. సాహస విన్యాసాలకు, స్నేహపూర్వక దేశాల మధ్య పరస్పర సహకారానికి ప్రతీకగా నిలిచే ఈ ఉత్సవాలకు విశాఖ సాగర తీరం ముస్తాబైంది. నేవీ ప్రతినిధులు, నౌకలు, సబ్ మేరియన్లు, ఎయిర్ క్రాఫ్ట్ లు ఒక్కచోట చేరి నిర్వహించే సమీక్షను ఐఎఫ్ఆర్ అంటారు. స్వతంత్ర భారతదేశంలో అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూ ఒక పెద్ద ఈవెంట్. మనదేశంలో మొదటి ఐఎఫ్ఆర్ 2001లో ముంబైలో నిర్వహించారు. రెండవది 2016లో విశాఖలో జరిగింది. 2026లో మూడవ ఐఎఫ్ఆర్ ను కూడా విశాఖపట్నంలో నిర్వహిస్తూ మన దేశం ఆతిథ్యమిస్తోంది. ఈనెల 15 నుండి 26 వరకు భారత్ దేశంలో అతి పెద్ద ఇఫర్ మరియు మిలన్ సంయుక్త సమీక్ష, విన్యాసాలు జరగనుంది. 18న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము యుద్ధనౌకల సమీక్ష చేయనున్నారు. మంగళవారం మీడియాతో ముందస్తు సమీక్షా నిర్వహించడం జరిగింది.నౌకల పెరేడ్ ను పరిశీలిస్తారు.71 నౌకలు ఆరు వరసల్లో బారులు తీరుతాయి. ఇందులో 19 విదేశీ నౌకలు, 45 భారత నౌకా దళం, కోస్ట్ గార్డ్, మర్చంట్ నేవీ, పరిశోధన నౌకలు ఉంటాయి. 65 దేశాల నుండి నౌక దళాలు పాల్గొంటున్నాయి. 2026 లో ఏకంగా మిలాన్ తో పాటు అంతర్జాతీయ యుద్ధనౌకల సమీక్ష (ఐఎఫ్ఆర్), భారత సముద్ర నౌకాదళ చర్చా గోష్టి కూడా జరుగుతోంది. ఇందులో 65 దేశాలు పాల్గొనడం మరింత ప్రాధాన్యతను సంతరించుకుంది.
నావికా బలాన్ని చాటేలా మిలాన్.
దేశ నావికా బలాన్ని చాటేలా మిత్ర దేశాలతో బంధం పెంచేలా మిలాన్ నిలుస్తోంది. ఈసారి భారతదేశం మిలాన్-2026 కు అధ్యక్షత వహిస్తోంది. ఈ నేపథ్యంలో విశాఖ బీచ్ రోడ్ లో సిటీ పెరేడ్ జరగనుంది. తొలిసారిగా 1995లో అండమాన్ నికోబార్ రాజధాని పోర్టు బ్లెయిర్ లో కేవలం నాలుగు దేశాలతో " . నాడు 'లుక్ ఈస్ట్ పాలసీ' ప్రారంభమైంది. ఇండోనేషియా, సింగపూర్, శ్రీలంక, థాయిలాండ్ దేశాలు భారత ఆధ్వర్యంలో సంయుక్త విన్యాసాలు చేపట్టాయి. తర్వాత 2022లో విశాఖ తీరాన జరిగిన'మిలాన్' లో మొత్తం 39 దేశాలు పాల్గొన్నాయి. 2024లో అతిపెద్ద ఎడిషన్ గా 51 దేశాలతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ విన్యాసాల్లో భారత్ ప్రతిష్టాత్మకమైన యుద్ధ విమాన వాహక నౌకలైన ఐఎన్ఎస్ విక్రాంత్, ఐ ఎన్ ఎస్ విక్రమాదిత్యలు పాల్గొనడం విశేషం. అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తదితర ప్రముఖులు పాల్గొనున్నారు. అలాగే భారత నావికాదళం నిర్వహణలో జరిగే ఈ ఈవెంట్ కు ప్రపంచ నలుమూలల నుంచి నావికులు హాజరవుతున్నారు.

# "టెన్"షన్ వద్దు

- టెన్త్ విద్యార్థుల బుర్ర తినకండి
- మానసిక స్వేచ్ఛం ధైర్యం ఇవ్వండి.



**మాచన రఘునందన్**
వ్యక్తిత్వ వికాస నిపుణులు
9441252121

ఎన్నో చిక్కులు.. జిగ్ జాగ్ గా పడి ఉన్న దారం ను జాగర్తగా విడదీయడానికి ఎంత ఓపిక,శ్రద్ధ ఆసక్తి కావాలో..అలాగే ఇప్పుడు సి బి ఎస్ ఈ పరీక్షల కు హాజరు అవుతున్న విద్యార్థుల బుర్ర ను అనుక్షణం వెంటాడుతూ..వెంబడిస్తూ.. ఏదో మిషన్ ఫాలో అప్ లా ఉండే కంటే వారిని కాస్త స్వేచ్ఛగా ఉండనివ్వండి.చెట్లపైన కరెంటు వైర్ల పై న..అయ్యో ఓ పక్షి మాంజా లో చిక్కుకు"పోయిందే" అని ఎలా బాధ పడతామో..అదే మాదిరి.మన పిల్లల్ని కూడా ఈ కొన్ని రోజుల పాటు కాస్త అలా "బీ యువర్ సెల్ఫ్" అని వదిలేయండి. పరీక్ష ముందర పరేషాన్ చేసుడు అంతగా వాంఛనీయం కాదు.ఏం చదువుకున్నారో..పిల్లలకు తెలుసు.ఇక కొందరు ట్యూషన్ కు కూడా వెళ్ళి అంటారు.ఇంతగా ప్రత్యేకంగా చదివించి కూడా..
ఎలా..ఎలా..ఎట్లా..ఎట్లా అని అస్తమానం కంగారు పడి పోకండి. కని పెంచి పెద్దచేసిన తల్లి దండ్రులే ..పిల్లలు ఏదో యుద్దానికి వెళ్ళే వారిలా..ఫీల్ ఐతే?! పిల్లలు అనవసరంగా కంగారు పడే అవకాశం లేక పోలేదు.
కాబట్టి డియర్ పేరెంట్ ప్రేమ ను పెంచండి. కంగారు,టెన్షన్ తగ్గించండి. ఇంట్లో ఎంతగా ప్రశాంతంగా ఉంటే.. టెన్త్ పిల్లలకు అంత మంచిది.
ఏదో..ఏదో..అలా ..ఊహించుకుని, మైండు ఖారాబ్ చేసుకోవాల్సిన అవసరం లేదు.మీ హీరో ను ఓ సూపర్ ఇన్నిఁగ్స్ ఆడటానికి వెళ్తున్న ధోనీ గా అనుకుని.జస్ట్ అలా ..నిర్భయం గా.. నిస్సంకోచంగా.. ఉండండి.మెదడు కు కావాల్సిన మానసిక ధైర్యం ం ఆలోచన స్వేచ్ఛ ను ఇవ్వండి. ఇక మరో విషయం పరీక్ష కేంద్రం నుంచి పిల్లలే వస్తారో.?; ఎవరు పీక్ అప్ చేస్తారో పేరెంట్స్ వెళ్ళి తీసుకొస్తారో..
వాట్ ఎవర్ ఇట్ మే బి. రాగానే.. పేపర్ ఎట్లోచ్చింది ఎలా రాశావ్ బాగా రాశావా లేదా.. అని ఏదో కేంద్ర దర్యాప్తు సంస్థలు అడిగినట్టు అడగడం ఏ మాత్రం అవసరం లేదు. ఎలా రాశారో..చెప్పే అవకాశం ఇవ్వండి. నేను సంగ్రామం కు వెళ్తున్నాను. అనే భావన పిల్లలకు వద్దండీ. ఏ బంతిని ఎలా ఆడతారో ఉతికి ఆరేస్తారో.. వాళ్ల పవర్ ఫుల్ బ్యాట్ కు వదిలేయండి. ప్లీజ్..ఇట్స్ మై హంబుల్ రిక్వెస్ట్

## రీ-సర్వే లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలి

**మొదటి పేజీ తరువాయి**
సారించాలని ఆదేశించారు. అలాగే మొత్తం 1,74,941 ఎల్.పి.ఎంలలో ఇంకా పెండింగ్‌లో ఉన్న వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని హెచ్చరించారు. రికార్డుల అప్‌లోడింగ్‌లో ఎటువంటి తప్పులు జరగకూడదని, రైతులు ఇబ్బంది పడకుండా సర్వే ప్రక్రియ పారదర్శకగా సాగాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అలాగే పట్టాదారు పాస్‌బుక్కుల జారీ ప్రక్రియపై కలెక్టర్ ప్రత్యేకంగా సమీక్షించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 5,133 ఖాతాలను పరిశీలించగా, అందులో 4,576 ఖాతాలు ముద్రణకు సిద్ధంగా ఉన్నాయని, ఇంకా 1,764 ఖాతాల్లో వ్యక్తిగత సమాచార సవరణలు అవసరమని, మరో 190 ఖాతాల్లో మ్యుటేషన్లు పెండింగ్‌లో ఉన్నాయని గుర్తించిన కలెక్టర్, వీటిని తక్షణమే పరిష్కరించి వంద శాతం లక్ష్యాన్ని చేరుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా స్థాయి అధికారులతో పాటు మండలాల నుంచి తహసీల్దార్లు, ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలకు శ్రీకాకుళం క్రీడాకారుల ఎంపిక

**నవతరం -శ్రీకాకుళం**
స్థానిక బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియంలో మంగళవారం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి చదరంగం పోటీలు ఉత్సాహంగా జరిగాయి. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ ఎంపిక పోటీల్లో జిల్లా వ్యాప్తంగా సుమారు వంద మంది బాలబాలికలు పాల్గొన్నారు. పదమూడేళ్ల లోపు బాలికల విభాగంలో బొల్లా శృతి, వైశ్యరాజు రోషిణి, బాలుర విభాగంలో బలివాడ జయంత్, బస్వ భానుతేజ్ ప్రతిభ చాటారు. అలాగే పదిహేనేళ్ల లోపు బాలుర విభాగంలో బొల్లా యశ్వంత్, బగాది కార్తికేయ, బాలికల విభాగంలో మెట్ట ప్రణీత, వడవలస లోచన విజేతలుగా నిలిచారు. పందొమ్మిదేళ్ల లోపు బాలికల విభాగంలో రుప్ప మహాలక్ష్మి, కూన ప్రమీల రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచిన ఈ క్రీడాకారులు ఈ నెల 21వ తేదీన తిరుపతిలో జరగనున్న రాష్ట్ర స్థాయి చదరంగం పోటీల్లో శ్రీకాకుళం జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించనున్నట్లు జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి మహేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను పలువురు అధికారులు, క్రీడాభిమానులు అభినందిస్తూ, రాష్ట్ర స్థాయిలో కూడా ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు.

## బొత్స సత్యనారాయణపై కిరాక్ ఆర్. పి వ్యంగ్య దూషణలు సబబు కాదు

- ఉత్తరాంధ్ర యాసను కించపరిస్తే ఊరుకునేది లేదు
- పలాస జిల్లా కేంద్ర సాధన కమిటీ కన్వీనర్ దువ్వాడ శ్రీధర్ (బాబా)

**(నవతరం -పలాస)**



వైయస్సార్ సిపి విపక్ష నేత , ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ పైన జబర్దస్త్ నటుడు కిరాక్ ఆర్. పి వ్యక్తిగతంగా, వ్యంగ్యశీ గా రాజకీయ విమర్శలు చేయడమే కాక ఉత్తరాంధ్ర యాసతో అసభ్యకర రీతిలో మాట్లాడిన తీరు సబబు కాదని ప్రముఖ సామాజికవేత్త, పలాస జిల్లా కేంద్ర సాధన కమిటీ కన్వీనర్ దువ్వాడ శ్రీధర్( బాబా) ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం పలాసలో ఆయన మాట్లాడుతూ, రాజకీయ పార్టీలు, రాజకీయ పార్టీల అండతో నడిపే డిజిటల్ మీడియాలు హద్దులు మీరుతున్నాయని, వ్యక్తిగత.. వ్యంగ్యంగా దూషణలు చేయడం పెచ్చు మీరుతోందన్నారు. శాసన మండలి లో ప్రభుత్వ వైఫల్యాలను ఒక విపక్ష నేతగా బొత్స సత్యనారాయణ అసెంబ్లీలో ప్రశ్నిస్తుంటే.. పొట్టకూటి కోసం టీవీ ఛానల్ లో స్కిట్లు వేసుకునే కమెడియన్లతో చిల్లర రాజకీయాలు సాగిస్తున్న తీరు జుగుప్సాకరంగా ఉందని దువ్వాడ శ్రీధర్ ( బాబా) ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్రలో ఉన్న కొద్దిమంది నాయకుల్లో కీలకమైన బొత్స సత్యనారాయణ ఒకరిని , ఆయన రాజకీయ ప్రయాణంలో ఎందరికో మేలు చేసి, మరి ఎందరికో రాజకీయంగా, సామాజికంగా అండగా నిలబడ్డ వ్యక్తిని, ఒక్క మాటలో చెప్పాలంటే రాజకీయాలలో అన్ని పార్టీల వారు ఆయనకు గౌరవిస్తుంటారని, అంతేకాక ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో అత్యంత ప్రాధాన్యం పొంది, దశాబ్దాల పాటు ప్రజాసేవలో అగ్రగామిగా నిలిచిన ఒక పెద్ద నాయకుడు అన్నారు. ఇటీవల కిరాక్ ఆర్ పి చేసిన వ్యాఖ్యలు సభ్య సమాజంలో అభ్యంతరంగా ఉన్నాయన్నారు. ప్రజాస్వామ్యంలో విమర్శలు సహజమని, విధానాలపై, ప్రభుత్వం నిర్ణయాలపై, రాజకీయ వైఖరిపై ఎవరైనా తమ అభిప్రాయాన్ని వ్యక్తపరచవచ్చునన్నారు. అయితే రాజకీయ పెద్దలను నోటికొచ్చినట్లు తూలనాడడం ప్రజాస్వామ్య సాంప్రదాయాలకు విరుద్ధమన్నారు. మన సంస్కృతి పెద్దలను గౌరవించే ధోరణి మనం మరవకూడదన్నారు. మాట ఒక శక్తి. అది నిర్మాణాత్మకంగా ఉపయోగిస్తే సమాజాన్ని ముందుకు తీసుకెళుతుందని, లేకపోతే విభేదాలను రెచ్చగొడుతుందని, ప్రజా వేదికను వ్యక్తిగత దూషణలకు వేదికగా ఉపయోగించడం సరికాదన్నారు. ఉత్తరాంధ్ర ప్రజల పరస్పర గౌరవాన్ని, రాజకీయ సంస్కారాన్ని అందరూ గౌరవించుకుని ముందుకు సాగాలని, ఇప్పటికైనా కిరాక్ ఆర్పి చేసిన వ్యాఖ్యలను తక్షణమే ఉపసంహరించుకొని, బహిరంగంగా క్షమాపణ చెప్పాలని దువ్వాడ శ్రీధర్ హితవు పలికారు. భవిష్యత్తులో ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు పునరావృతం కాకుండా రాజకీయ నేతలు, సోషల్ మీడియా యాక్టివిటీస్లు సమన్వయంతో స్వీయ నియంత్రణ కలిగి ఉండాలని, అలాంటప్పుడే ప్రజాస్వామ్యం లో విలువలు పెంపొందుతాయని దువ్వాడ శ్రీధర్ (బాబా) స్పష్టం చేశారు.

## ఇకపై ఈ హీరోయిన్ రహస్యంగా ఆ పని చేయనక్కర్లేదు



హీరోయిన్ గా ఛాన్స్ రావడం ఒకెత్తు, దాన్ని నిలబెట్టుకోవడం మరో ఎత్తు. ఫ్లాప్ వచ్చినా నిలబడడం ఇంకా పెద్ద ఎత్తు. దీని కోసం చాలానే కష్టపడింది హీరోయిన్ కాయదు లోహర్.
తొలి తెలుగు సినిమా ఫ్లాప్ అయిన తర్వాత కూడా పట్టు వదల్లేదు. సోషల్ మీడియాలో క్రేజ్ పెంచుకోవడంతో పాటు, ఇండస్ట్రీకి దగ్గరయ్యేందుకు తెరవెనక చాలానే కష్టపడింది. సొంతంగా పీఆర్ టీమ్ ను మెయింటైన్ చేసేంత స్తోమత లేకపోవడంతో, తనే స్వయంగా సోషల్ మీడియాలో కొన్ని ఘోస్ట్ ఎకౌంట్లు క్రియేట్ చేసుకుంది. మొత్తానికి ఆమె కష్టం ఫలించింది. కాయదు ఇండస్ట్రీ దృష్టిలో పడింది. గమ్మత్తైన విషయం ఏంటంటే, ఫంకీ సినిమా అట్టర్ ఫ్లాప్ అయినప్పటికీ, కాయదు లుక్స్ కు, ఆమె ఎనర్జిటిక్ యాక్టింగ్ కు మంచి మార్కులు పడ్డాయి. ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ నాని సరసన ది ప్యారడైజ్ సినిమాలో నటిస్తోంది. అటు తమిళ సినిమాలతో కూడా బిజీగా ఉంది. రాబోయే రోజుల్లో మరిన్ని తెలుగు సినిమాలు క్యూ కట్టబోతున్నాయి. సో.. ఇకపై సీక్రెట్ గా ఘోస్ట్ ఎకౌంట్లు మెయింటైన్ చేయాల్సిన అవసరం కాయదుకు రాకపోవచ్చు. ఎందుకంటే, ఆమె ఫొటోల్ని, ఆమె పోస్టుల్ని షేర్ చేసే బ్యాచ్ సోషల్ మీడియాలో తయారైంది. ఆమెకిప్పుడు రీచ్ బాగా పెరిగింది.

## ఎట్టకేలకు సర్జరీపై స్పందించిన చిరంజీవి



ఇప్పటికే వెల్లడించింది. ఆయన భుజానికి శస్త్రచికిత్స జరిగిందని, అయినప్పటికీ ఫ్యాన్స్ కోసం బ్లడ్ బ్యాంకుకు వచ్చి అభిమానులతో ఫొటోలు దిగారనే విషయాన్ని వెల్లడించాం.
ఇప్పుడా సర్జరీపై స్వయంగా చిరంజీవి స్పందించారు.
తన భుజానికి సర్జరీ జరిగిందనే విషయాన్ని వెల్లడించిన చిరంజీవి, అది చాలా చిన్న సర్జరీ అని, పైగా ఇప్పుడు తను దాదాపు కోలుకున్నానని స్పష్టం చేశారు.
"ఇది కేవలం ఒక చిన్న షోల్డర్ కీహోల్ సర్జరీ. నేను బాగానే కోలుకుంటున్నాను. ఇప్పటికే నా రెగ్యులర్ పనులు చేసుకుంటున్నాను. అత్యుత్తమ ఆర్థోస్కోపీ సర్జన్లలో ఒకరైన డాక్టర్ నితిన్ కు ధన్యవాదాలు. మీ అందరి ప్రేమ, ఆశీర్వాదాలకు ధన్యవాదాలు." అంటూ పోస్టు పెట్టారు. అల్లు శిరీశ్ పెళ్లి వేడుకలు మొదలయ్యాయి. తొలి శుభలేఖను చిరంజీవి దంపతులకు అందజేసింది అల్లు అరవింద్ ఫ్యామిలీ. ఈ సందర్భంగా విడుదలైన ఫొటోల్లో చిరంజీవి చేతికి బ్యాగుతో కనిపించడంతో చాలామంది ఆందోళన చెందారు.
ఆయనకు శస్త్రచికిత్స జరిగిందంటూ వార్తలొస్తే, చాలామంది వాటిని పుకార్లు అనుకున్నారు. ఎప్పుడైతే ఇలా కట్టుతో కనిపించారో అందర్లో ఆందోళన మొదలైంది. దీంతో చిరంజీవి స్వయంగా తన సర్జరీపై స్పందించారు.

# ఆప్తాల్మిక్ ఆఫీసర్ వసంతరావు సేవలకు గుర్తింపు

## వృత్తి, ప్రవృత్తి ద్వారా అనేకమార్లు జిల్లా, రాష్ట్ర స్థాయి, రాష్ట్ర గవర్నర్ గారి అవార్డ్స్

**నవతరం -శ్రీకాకుళం**



వృత్తినే పరమావధిగా భావించి గత 30 సంవత్సరాలలో మారుమూల గ్రామాలను సైతం సందర్శించి లక్షలాది మందికి నేత్ర వైద్య సేవలు అందించి, వేలాది మందికి కంటి శస్త్ర చికిత్సలు చేయించడంలో అతనికి అతనే సాటి. అతనే సప్పటి వసంతరావు. ప్రస్తుతం విజయనగరం జిల్లా , తెర్లాం మండలంలోనీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పెరుమాలిలో పనిచేస్తున్నారు. ఎక్కడ, ఎంత మారుమూల ప్రాంతంలో పనిచేసిన ప్రజలకు అందుబాటులో ఉంటూ నేత్ర పరీక్షలు చేయడం, ప్రజలకు కంటి ఆరోగ్యం పైన ఉండే అపోహలు పారద్రోలే విధంగా నేత్ర సంరక్షణ అవగాహన కార్యక్రమాలు పాఠశాలలోను, గ్రామాల్లోనూ నిరంతరం చేపట్టడంలో అతనికి సాటి లేరు. ముఖ్యంగా చిన్నారుల కంటి ఆరోగ్యం పట్ల తల్లులకు, యువతకు అవగాహన కల్పించడం అతని యొక్క నిరంతర ప్రక్రియ. పాఠశాలలను సందర్శించి విద్యార్థులలో దృష్టిలోపాలకు కారణాలు, నివారణ మార్గాలు వివరించడంలో ఉపాధ్యాయుని పాత్రలో కనిపిస్తారు. జీవన సరళి కారణంగా వచ్చే బీపీ, షుగర్, క్యాన్సర్ వంటి వ్యాధుల పట్ల మహిళలకు, పాఠశాల విద్యార్థులకు, యువతకు అవగాహన కల్పించడం ద్వారా ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధనకు నిరంతరం తన వంతుగా కృషిచేయడం ఆయన ప్రవృత్తి. రక్తదానం, నేత్రదానం, అవయవదానం పైన మహిళలకు, యువతకు అవగాహన కల్పించడం, శిబిరాలను, అవగాహన ర్యాలీలు నిర్వహించడం, ప్రింట్ మీడియా ద్వారా వ్యాసాలు వ్రాయడం, జిఎంఆర్ సామాజిక రేడియో ద్వారా ప్రజలకు అవగాహన కల్పించడంలో సరిలేరు ఎవ్వరు అనే చందనంగా అతని పనితీరు ఉంటుంది. అతను చేయని సామాజిక కార్యక్రమం అంటే యేదిలేదని చెప్పవచ్చు.

పి4 కు 2016 లో నాంది పలికిన వసంతరావు చిరు ఉద్యోగిగా ప్రాంతీయ ఆసుపత్రి, రాజాంలో అప్తాల్మిక్ ఆఫీసర్ గా 2011- 2020 మధ్య పనిచేసేటప్పుడు రాజాం పట్టణంలోని తిమ్మయ్య పేట గిరిజన గ్రామ ప్రజల దుస్థితి అతనిని బాగా కలచివేసింది. ఆ గ్రామాన్ని 2016 లో దత్తత తీసుకున్నారు. ముందుగా గ్రామంలోని బడిబయట ఉన్న విద్యార్థులను గుర్తించారు. మూసివేసిన పాఠశాలను మండల అభివృద్ధి అధికారికి సంప్రదించి తెరిచారు. ప్రతి రోజు రెండు గంటల సేపు విద్యార్థులకు పాఠాలు బోధించేవారు. పిమ్మట విద్యార్థులను వసతి గృహంలో చేర్పించి వారి చదువుకు కావలసినవి సమకూర్చారు. డ్రపౌట్స్ ను రూపుమాపారు. అనంతం గ్రామప్రజలతో పలుమార్లు సమావేశాలు నిర్వహించిన వసంతరావు వారి మౌలిక వసతుల లేమి సమస్యలు, త్రాగు నీరు, రోడ్లు , మరుగుదొడ్లు లేకపోవడం, వంట గ్యాస్ లేకపోవడం, పెన్షన్లు వంటి పలు రకాల సమస్యలు తెలుసుకున్నారు. ఆ పిమ్మట ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధులతోను, నగర పంచాయతీ అధికారులతో, జిల్లా కలెక్టర్, ఐటిడిఎ పి ఓ లతో సంప్రదించి పలుమార్లు అర్జీలు అందజేశారు. ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు సహకారంతో గ్రామంలో , ఇంటింటికి త్రాగు నీటి కుళాయిలు, ప్రతి ఒక్కరికి వంట గ్యాస్ అందించడం,సుమారు 25 లక్షల రూపాయలు సిమెంట్ రోడ్లు వేసినపుడు అందుకు కావలసిన మురుగు కాలువ కొరకు లక్ష రూపాయలు విలువ చేసే స్థలాన్ని తన సొంత డబ్బులతో కొని నగర పంచాయతీకి అందజేయడంలో తన వంతు కృషిచేశారు. ఒకప్పుడు అరకొర చదువులతో ఉన్న ఆ గ్రామ ప్రజలు 2025 నాటికి డిగ్రీ, నర్సింగ్, టెక్నికల్ విద్య నభ్యసించి తమ కాళ్ల పైన తాము నిలబడేటట్టు చేయడంలో వసంతరావు కృషి అనిర్వచనీయం. ప్రభుత్వ ఉద్యోగిగా అత్యుత్తమ సేవలంచడం ద్వారానే కాక ప్రభావతి జాగృతి వ్యవస్థాపక అధ్యక్షునిగా, రోటరీ క్లబ్ రాజాం టౌన్ కార్యదర్శిగా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వసంతరావు ప్రజల బ్రతుకులో వసంతుడైనాడు.

2021 సంవత్సరంలో మాజీ ప్రధాని స్వర్గీయ పి. వి. నరసింహారావు శత జయంతి సందర్భంగా "ప్రజాసేవ" విభాగంలో హైదరాబాదులోని టాటా మెమోరియల్ హాల్ లో నిర్వహించి అవార్డ్స్ ప్రధానోత్సవ కార్యక్రమంలో వారి కుమారుడు ప్రొఫెసర్. ప్రభాకర్ గారి చేతుల మీద జాతీయ అవార్డు అందుకున్నారు.

ఈ ఏడాది గణతంత్ర దినోత్సవం సందర్భంగా విజయనగరం జిల్లా కలెక్టర్ సురేంద్ర రెడ్డి గారి చేతుల జిల్లా ఉత్తమ ఆప్తాల్మిక్ ఆఫీసర్ గా అవార్డ్ పొందారు.

### ప్రముఖుల ప్రశంశలు

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో "ఏపీ స్టేట్ అల్లైడ్ హెల్త్ కేర్ ప్రొఫెషనల్ కౌన్సిల్" లో ఆప్తాల్మిక్ సైన్సెస్ ప్రొఫెషనల్ విభాగం నుండి మొట్టమొదటి సారి ఆప్తాల్మిక్ ఆఫీసర్స్ ను కౌన్సిల్ మెంబర్ గా రాష్ట్ర ప్రభుత్వం నామినేట్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర ఏవియేషన్ మంత్రి గౌరవనీయులు కింజరాపు రామమోహన్ నాయుడు గారు శ్రీకాకుళంలోని తన క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసిన సప్పటి వసంతరావు ( ఆప్తాలమిక్ ఆఫీసర్)నకు అభినందలు తెలుపుతూ, దుషాలువతో సత్కరించారు. అదేవిధంగా బొబ్బిలి, రాజాం, ఆమదాలవలస గౌరవ శాసన సభ్యులు ఆర్.వి.ఎస్.కె.కె రంగారావు(బేబీ నాయన) గారు, కొండ్రు మురళి మోహన్ గారు, కూన రవికుమార్ గారు వసంతరావుకు అభినందనలు తెలిపారు. విజయనగరం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్. జిల్లా అందత్వ, దృష్టి నివారణ కార్యక్రమం ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్. కే. త్రినాథరావు, రాష్ట్ర అందత్వ దృష్టి నివారణ కార్యక్రమం సంయుక్త సంచాలకులు డాక్టర్ . సునీల్ నాయక్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఆప్తాల్మిక్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె జె రఘురామిరెడ్డి, మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఆర్.కె .దాస్ మరియు కార్యనిర్వాహక సభ్యులు వసంతరావు అభినందనలు తెలిపారు.

# రాష్ట్రస్థాయి పోటీలకు సిక్కోలు క్రీడాకారులు ఎంపిక

**నవతరం -శ్రీకాకుళం**

ఈనెల 23వ తేదీన విశాఖపట్నంలో ది ఆంధ్ర బాడీబిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మిస్టర్ ఆంధ్ర రాష్ట్ర స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలు జరుగనున్నాయి. ఈ పోటీల్లో మన శ్రీకాకుళం జిల్లా నుంచి సుమారు 20 మంది పాల్గొంటారని, స్టార్ బాడీ బిల్డర్స్ ప్రధాన కార్యదర్శి వి. విజయకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈరోజు కేఆర్ స్టేడియంలో క్రీడాకారులను ఎంపిక చేయడం జరిగిందని, శ్రీకాకుళంకి చెందిన ఎస్. వంశి రెడ్డి 55 కేజీలు వి.ఉదయ్ కిరణ్ కేజీలు, ఓజి జిమ్ శ్రీకాకుళం పి.ధనరాజు 60 కేజీలు, ఫ్లెక్స్ జిమ్ శ్రీకాకుళం ఇబ్రహీం 60 కేజీలు, ఓజి జిమ్ శ్రీకాకుళం కె.విష్ణువర్ధన్ 75 కేజీలు, ఓజి జిమ్ శ్రీకాకుళం ఆర్. ఢిల్లీశ్వరరావు, ఫ్లెక్స్ జిమ్ శ్రీకాకుళం మాస్టర్ క్యాటగిరిలో కే.గౌరీ శంకర్, ఫ్లెక్స్ జిమ్ శ్రీకాకుళం నుంచి ఎంపిక అవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన క్రీడాకారులకు, ది ఆంధ్ర బాడీ బిల్డర్స్ అసోసియేషన్ జిల్లా సెక్రెటరీ కే గౌరీ శంకర్, టి. జీవన్, బలగ. ప్రసాద్, శ్రీకాకుళం సీనియర్ బాడీబిల్డర్లు తదితరులు అభినందలు తెలిపారు.



# కవి సోమలయ్యకు సాహితీ శిరోమణి బిరుదు

**నవతరం -మందస**

మందస మండలం కిల్లో ఈ కాలనీ గిరిజన గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు ఆదివాసి బిడ్డ కవి సిక్కోలు సాహితీ కవితా సంబరాల్లో భాగంగా జాతీయ శతాధిక కవి సమ్మేళనము పురస్కరించుకొని జిల్లా శ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో, అంతర్జాతీయ కళావేదిక చైర్మన్ కత్తి మండ ప్రసాద్ చేతుల మీదగా సవర సోమలయ్యకు మెమొంటోను దుస్సాలుగా కప్పి కిరీటాన్ని అమర్చి పూలమాలలో సత్కరించి సాహితీ శిరోమణి బిరుదును ఈయనకు అంకితం చేశారు. కవి సోములయ్య మాస్టర్ నా ఉద్దానం తల్లి కన్నీరు అనే కవితను ఎంపిక చేసి సాహితీ శిరోమణి బిరుదును ఆయనకు అంకితం చేసి గౌరవించారు ఈ బిరుదును ఆదివాసీలకు అంకితం చేసినట్టు కవి ఎస్ సోమలయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు, సికోలు సాహితీ ప్రతినిధులు, కవులు మేధావులు గ్రామస్తులు కుటుంబీకులు సోమలయ్యను అభినందించారు.



# దళిత సమస్యలపై అధికారులకు వినతి

**నవతరం -శ్రీకాకుళం**

జిల్లా ఎస్పీ వివేకానంద్, శ్రీకాకుళం మున్సిపాలిటీ కమిషనర్ హనుమంతు కూర్మా రావును దళిత ఆదివాసి జేఏసీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం డివిజన్ మరియు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న దళితుల సమస్యలను వారికి వివరించారు. దీనిపై అధికారులు సానుకూలంగా స్పందిస్తూ, ఎటువంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని భరోసా ఇచ్చారు. వారికి సంఘం తరఫున నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత ఆదివాసి జేఏసీ రాష్ట్ర డైరెక్టర్ బోనెల అప్పారావు, ఎస్సీ-ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు తోట రాము, దండా రాంబాబు (జాన్), గేదెల వెంకటరమణ, గంజి ఎజ్రా, దళిత హక్కుల పరిరక్షణ సమితి శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు అంపోలు ప్రతాప్, ప్రధాన కార్యదర్శి పోతల దుర్గారావు, దత్తి గోవిందరావు, బైరి ధనరాజ్, పాండ్రంకి తారక్ తదితర నాయకులు పాల్గొన్నారు.



# జేఈఈ మెయిన్స్ 2026 ఫలితాలలో శ్రీకాకుళం కాకినాడ ఆదిత్య జూనియర్ కాలేజీ విజయ ప్రభంజనం

**నవతరం -శ్రీకాకుళం**

జేఈఈ మెయిన్స్ ఫలితాలలో కాకినాడ ఆదిత్య జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు లు సాదించి విజయ కేతనం ఎగురవేశారు. ఉత్తమ ఫలితాలు సాదించిన విద్యార్థులు పొడుగు సాయి కృష్ణ(96.17), కొరడా నవనీత(95.43), వాకాడ గాయిత్రి లక్ష్మి (92.38) తో పాటు సుమారు 82 శాతం పాయింట్స్ ను 18 మంది సాదించారని ఆదిత్య విద్యా సంస్థలు సెక్రెటరీ ఎన్ దీపక్ రెడ్డి తెలిపారు.

ఉత్తమ ఫలితాలు సాదించిన విద్యార్థులును మరియు బోధించిన అధ్యాపకులు మరియు తల్లి తండ్రులను కళాశాల డైరెక్టర్ బిఎస్ చక్రవర్తి సిఇఓ పిరామారావు కళాశాల ప్రిన్సిపల్ ఎం ఢిల్లీశ్వరరావు అభినందించారు ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ పి అసిరినాయుడు మరియు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.






# దండి వీధిలో కొనసాగుతున్న సీసీ రోడ్డు పనులు

**నవతరం -శ్రీకాకుళం**

శ్రీకాకుళం 31వ డివిజన్‌లో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను డివిజన్ ఇంచార్జి విభూతి సూరిబాబు పరిశీలించారు. పనుల నాణ్యతపై రాజీ పడొద్దని గుత్తేదారుకు సూచించారు.

శ్రీకాకుళం నగరంలోని 31వ డివిజన్ పరిధి దండి వీధిలో కొనసాగుతున్న సీసీ రోడ్డు పనులను ఏపీ ప్రభుత్వం కనీస వేతన సలహా మండలి డైరెక్టర్, డివిజన్ ఇంచార్జి విభూతి సూరిబాబు ఈ రోజు పరిశీలించారు.

సచివాలయ సిబ్బందితో కలిసి పనుల పురోగతి, నాణ్యతను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు దీర్ఘకాల ప్రయోజనం కలిగేలా నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని గుత్తేదారుకు స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. కార్యక్రమం లో ఏ ఈ రాకేష్, సచివాలయ ఉద్యోగి చంద్ర బాబు తదితరులు ఉన్నారు

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**